క్లుప్తంగా

కలెక్టర్‌కు రెవెన్యూ ఉద్యోగుల సన్మానం



కలెక్టర్ మల్లికార్జునను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

సీతంపేట: కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను విశాఖ రెవెన్యూ ఉద్యోగులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ భవిత కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన నిరామయ ఆరోగ్య బీమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల ఆయన ప్రారంభించిన సంజీవని నిధి-డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌లో ఉద్యోగులను భాగస్వామ్యం చేయడం, ఆ నిధితో దివ్యాంగులకు ఆరోగ్య బీమా కల్పించి, ఇటువంటి గొప్ప కార్యక్రమంలో పరోక్షంగా ఉద్యోగులను భాగస్వామ్యం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్యామ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్మ, సెక్రటరీ సిహెచ్.రమేష్, ఈసీ మెంబర్స్ సుధాకర్, మహేష్, కలెక్టర్ ఏవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌కు వితరణ



నిత్యావసర సరకులు, స్టీల్ సామగ్రి అందిస్తున్న ఏపీ జేఏసీ పరిరక్షణ సమితి కన్వీనర్ ప్రియాంక

ఆరిలోవ: ఆరిలోవలో జీవీఎంసీ ఆధ్వర్యంలో అమ్మానాన్న వెల్ఫేర్ సొసైటీ నిర్వహిస్తున్న నైట్ షెల్టర్‌కు శనివారం ఏపీ జేఏసీ పరిరక్షణ సమితి కన్వీనర్ ప్రియాంక సహకారం అందించారు. నిత్యావసర సరకులు, బియ్యం, స్టీల్ సామగ్రి, గ్యాస్ స్టౌవ్, రెండు గ్యాస్ సిలిండర్లు ఇక్కడ వృద్ధులకు నిర్వాహకుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కౌసర్, జగన్, సొసైటీసభ్యులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



రోడ్డుపై షాపులను తొలగిస్తున్న అధికారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో రోడ్లు ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపుల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. వాహనదారులకు ఇబ్బంది కలిగేలా ఏర్పాటు చేసిన దుకాణాలను జీవీఎంసీ అధికారులు రెండు రోజులుగా తొలగిస్తున్న విషయం తెలిసిందే. రైతు బజార్‌ను ఆనుకొని ఎంవీపీ డబుల్ రోడ్డులో ఉన్న షాపులను శనివారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వరరావు, పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సూత్రా ఎగ్జిబిషన్



సందర్శకులతో కిటకిటలాడుతున్న ఎగ్జిబిషన్

బీచ్‌రోడ్డు: దేశం నలుమూలల నుంచి సేకరించిన అద్భుతమైన ఫ్యాషన్ వస్త్రాల ప్రదర్శన సూత్రా ఎగ్జిబిషన్‌కు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బీచ్ రోడ్డులోని నోవొటెల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో డ్రెస్సుల నుంచి గౌన్ల వరకు, చీరలు, పాదరక్షలు, ఉపకరణాలు ఆకట్టుకుంటున్నాయి. 40కి పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ ఆదివారం సాయంత్రం 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విశాలంగా ప్రధాన రహదారులు

- జోరుగా విస్తరణ పనులు
- తీరనున్న ట్రాఫిక్ సమస్యలు



పార్వతీనగర్ గెడ్డ వద్ద బ్రిడ్జి, నివాసాలు



సీతకొండ మలుపు వద్ద విస్తరిస్తున్న బీచ్ రోడ్డు



చినగదిలి సాయిబాబా ఆలయం నుంచి పార్వతీనగర్ వరకు నిర్మాణంలో ఉన్న రహదారి

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇరుగ్గా ఉన్న ప్రధాన రహదారులకు మోక్షం కలుగుతోంది. వాటి విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు తీరడంతోపాటు రోడ్డు ప్రమాదాలకు బ్రేక్ పడనుంది. ఆరిలోవలో ఓ ప్రధాన రహదారితోపాటు విశాలాక్షినగర్‌లో సీతకొండ మలుపు వద్ద బీచ్ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కోట్ల రూపాయలతో చేపడుతున్న ఆయా అభివృద్ధి పనులతో ప్రధాన రహదారులకు కొత్తరూపు రానుంది. డబుల్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ లైటింగ్‌తో వీటిని విశాలంగా.. సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

ఆరిలోవలో 80 ఫీట్ రోడ్..

జీవీఎంసీ 12వ వార్డు ఆరిలోవ పరిధిలో చినగదిలి బీఆర్‌టీఎస్ కూడలిలోని నార్త్ షిర్డీసాయిబాబా మందిరం నుంచి పార్వతీనగర్ గెడ్డపై బ్రిడ్జి వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో జీవీఎంసీ అధికారులు దీన్ని నిర్మిస్తున్నారు. రూ.2.35 కోట్లతో సుమారు అర కిలో మీటర్ పొడవున 30 అడుగుల వెడల్పు గల ఇరుకు రోడ్డును 80 అడుగులకు విస్తరిస్తున్నారు. ఇక్కడ డబుల్ రోడ్డు నిర్మించి మధ్యలో డివైడర్, ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఇంతవరకు ఇక్కడ ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందిపడిన వాహన చోదకులకు ఊరట కలుగుతుంది. కొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తికానున్నాయి.

బ్రిడ్జి, నివాసాల ఆటంకం..

ఇదిలా ఉండగా చినగదిలి సాయిబాబా గుడి నుంచి పార్వతీనగర్ గెడ్డ వరకు ఈ రోడ్డును విస్తరించి శ్రీకాంత్‌నగర్ డబుల్ రోడ్డుకు కలుపుతారు. అంతవరకు బాగానే ఉన్నా.. శ్రీకాంత్‌నగర్ డబుల్ రోడ్డుకు అడ్డంగా దశాబ్దాలుగా కొన్ని నివాసాలు ఉన్నాయి. సుమారు 20 ఏళ్ల కిందట నిర్మించిన ఈ రోడ్డు వద్ద నివాసులకు అధికారులు ఇంతవరకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపలేదు. డబుల్ రోడ్డుకు గెడ్డ అంచున చివరలో అడ్డుగా కొన్ని ఇళ్లు ఉన్నాయి. వాటి వద్ద ఇరుగ్గా సింగిల్ రోడ్డు మిగిలిపోయింది. ప్రస్తుతం నిర్మిస్తున్న కొత్త రోడ్డుకు కూడా చివరన ఇవే నివాసాలు అడ్డంగా మారుతున్నాయి. ఈసారి అధికారులు వారికి ఎలాంటి ప్రత్యేమ్నాయం కల్పిస్తారో, లేదంటే ఇరుకు రోడ్డును ఎప్పటిలాగే వదిలేస్తారో వేచిచూడాల్సిందే.

బీచ్ రోడ్డులో..

తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ సమీపం బీచ్ రోడ్డులో సీతకొండ వద్ద వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ నుంచి విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి వరకు ఇరుకు రోడ్డు విస్తరణ పనులను ఆర్ ఎండ్ బీ విభాగం ఆధ్వర్యంలో అధికారులు చేపట్టారు. ఇక్కడ సమారు 400 మీటర్ల పొడవులో 30 అడుగుల వెడల్పు గల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తున్నారు. దీంతోపాటు జీవీఎంసీ నిధులతో అధికారులు సీవ్యూ పాయింట్‌కు వెళ్లే సందర్శకుల వాహనాల పార్కింగ్, సెంట్రల్ లైటింగ్, ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు భాగంలో రెండు ప్రమాదకరమైన మలుపులున్నాయి. ఇంతవరకు సింగిల్ రోడ్డు కావడంతో మలుపుల వద్ద ఎదురెదురుగా ప్రయాణించే వాహనాలు తరుచూ ఢీకొని ప్రమాదాలు జరుగుతుండేవి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రమాదాలకు బ్రేక్ పడుతుందని వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సెంట్రల్ లైటింగ్‌తో రోడ్ల నిర్మాణం

చినగదిలి సాయిబాబా గుడి నుంచి పార్వతీనగర్ వరకు డబుల్ రోడ్డు, సీతకొండ వద్ద బీచ్ రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్నాం. ఆయా చోట్ల సెంట్రల్ లైటింగ్‌తోపాటు ఫుట్‌పాత్‌లు నిర్మించి పచ్చదనం ఏర్పాటు చేసి అందంగా తయారుచేస్తాం. బీచ్ రోడ్డులో ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. బీచ్ రోడ్డు విస్తరణ పనులు ముగిసిన వెంటనే సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌లు, వాహనాల పార్కింగ్ కోసం పనులు జీవీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతాయి.

– వంశీకృష్ణ, డీఈ, జీవీఎంసీ

పరిపాలన రాజధానిని అడ్డుకుంటే చరిత్ర హీనులే..

- మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి



మాట్లాడుతున్న భానుమతి

బీచ్‌రోడ్డు: విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటును అడ్డుకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి అన్నారు. బీచ్‌రోడ్డులోని ఆమె నివాసంలో శనివారం మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఉత్తరాంధ్ర ప్రజలు మంచితనాన్ని చేతగానితనంగా తీసుకుంటున్నారని మండిపడ్డారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటై యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తద్వారా ఉత్తరాంధ్ర నుంచి వలసలు తగ్గుతాయన్నారు. పార్టీలకతీతంగా విశాఖ పరిపాలనా రాజధాని కోసం ఏకం కావాలన్నారు. అమరావతిలో ఇప్పటికి కూడా సరైన మౌలిక వసతులు లేవన్నారు.అందుకే శివరామకృష్ణన్ కమిటీ కూడా విశాఖనే రాజధానిగా సూచించిందన్నారు. చంద్రబాబు నాయుడు స్వలాభం కోసమే అమరావతిని రాజధాని ప్రకటించారని ఆరోపించారు. అమరావతిలో చంద్రబాబు నాయుడు తన సొంత మనసులకు భూములు దోచిపెట్టారని ఆరోపించారు.

చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం



పెదగదిలి జంక్షన్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బ్యానర్ పట్టుకొని నినాదాలు చేస్తున్న కార్పొరేటర్లు, కార్యకర్తలు

ఆరిలోవ: రాష్ట్రంలోని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఇళ్లపై టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు, వార్డుల ఇన్‌చార్జులు, కార్యకర్తలు కలిసి శనివారం ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో పెదగదిలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. చంద్రబాబు ఫోర్ట్వంటీ(420) అంటూ కార్యకర్తలు జంక్షన్‌లో బైఠాయించి ప్లకార్డులు చూపుతూ నినాదాలు చేశారు. దీంతో వాహన రాకపోకలు కొంతసేపు నిలిచిపోయాయి. ఆరిలోవ సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించి కార్యకర్తలను పక్కకు జరిపి వాహన రాకపోకలకు వీలు కలిగించారు.

పేదలకు క్షమాపణ చెప్పాలి..

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, కెల్ల సునీత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేదలకు ఇళ్లు ఇస్తుంటే చంద్రబాబు అడుగ్డుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లను శ్మశానంతో పోల్చి పేదలను కించబరచడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఈ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని పేదలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు వార్డుల ఇన్‌చార్జిలు జగ్గుపల్లి అప్పలరాజు, కెల్ల సత్యనారాయణ, సూరాడ దాసు, భాగ్యానంద్, నాయకులు కొరికాన మోహనరావు, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, పి.ఐ.బాలరాజు, దూలి రఘు, ఉమామహేశ్వరరావు, మోహన్‌రెడ్డి, హుస్సేన్, శిరీషా, కళావతి, బేగం, ముద్దాడ పాపారావు, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం



వేసవి శిక్షణ విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న పోలీస్ అధికారులు

ఆరిలోవ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని రిటైర్డ్ ఎస్పీ టి.ఎస్.ఆర్.ప్రసాద్ అన్నారు. ఆరిలోవ సీఐ సోమశేఖర్ సహకారంతో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పిల్లలకు వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. జూన్ 5 వరకు కొనసాగనున్న ఈ శిబిరానికి అవసరమైన వాలీబాల్, బాస్కెట్ బాల్, త్రో బాల్ తదితర సామగ్రిని శనివారం పిల్లలకు ముఖ్య అతిథి ప్రసాద్‌తోపాటు అతిథి ద్వారకా ఏసీపీ మూర్తి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద విద్యార్థులు ఎంతోమంది క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించారన్నారు. దేశం గర్వించే క్రీడాకారులుగా సేవలు అందిస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు క్రీడల్లో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిన సీఐ సోమశేఖర్‌ను అభినందించారు. పాఠశాలలకు సెలవు రోజుల్లో క్రీడలుపై ఆసక్తి కనబరిస్తే చెడు అలవాట్లకు దూరమవుతారన్నారు. విద్యార్థులు వారికి నచ్చిన ఏదో ఒక క్రీడ ఎంచుకొని రాణించాలని సూచించారు. పిల్లలకు వారి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సోమశేఖర్, పలువురు కోచ్‌లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం



ఐవోసీఎల్ డైరెక్టర్ రామ్‌కుమార్‌కు సత్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఇంధన రంగంలో యవ ఆవిష్కరణలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఐవోసీఎల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రామ్‌కుమార్ అన్నారు. ఏయూ సెనేట్ మందిరంలో శనివారం నిర్వహించిన స్టార్టప్ ఫండ్ ప్రీ పిచ్చింగ్ సెషన్‌లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. యువత నవ్య ఆలోచనలతో వస్తే వారికి అవసరమైన సాంకేతికత, ఆర్థిక సహకారాన్ని తాము అందిస్తామన్నారు. సమష్టిగా కలిసి పనిచేసే దిశగా యూత్‌ను ఆహ్వానిస్తున్నామన్నారు. శిలాజ ఇంధనాల నుంచి గ్రీన్ ఎనర్జీ దిశగా రూపాంతరం చెందుతున్నామన్నారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని సూచించారు.

కలిసి పనిచేయడం గర్వకారణం

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు పరిష్కారాలను చూపాలని సూచించారు. నేటి సవాళ్లను స్వీకరించిన వారికి రేపటి ప్రపంచం పాదాక్రాంతమవుతుందన్నారు. అభివృద్ధి చెందిన భారతావని త్వరలో సాకారం కానుందన్నారు. స్టార్టప్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్యూనర్‌షిప్ లక్ష్యంగా యువతను తీర్చిదిద్దే దిశగా పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. దేశానికే గర్వకారణంగా నిలచే ఐవోసీఎల్ సంస్థ ఏయూతో కలసి పనిచేయడం వర్సిటీకి ఎంతో గర్వ కారణమన్నారు. ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు చేయడానికి అవసరమైన ఆర్థిక వనరులను అందించే సంస్థలు ఏయూకు రావడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఏయూ తరపున ఐవోసీఎల్ డైరెక్టర్ రామ్‌కుమార్‌ను వీసీ సత్కరించారు. అనంతరం విద్యార్థులు ఐవోసీఎల్ పరిశ్రమకు అవసరమైన పరిశోధన పరమైన అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐవోసీఎల్ అధికారులు, వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు ప్రసాద్, లోహిత్, దిగ్విజయ్‌లు

విశాఖ స్పోర్ట్స్ : మెన్ యూత్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ బాంటమ్ వెయిట్ ఫైనల్ బౌట్‌లో అనంతపురానికి చెందిన వి.పవన్‌తో స్థానిక బాక్సర్ పి.ప్రసాద్ తలపడనున్నాడు. మినిమం వెయిట్‌లో ఎస్.తేజశ్వర్‌తో పి.వాసుదేవ పాత్రుడు ఫైనల్‌లో తలపడనున్నాడు. ఫ్లైవెయిట్ 48–51కేజీల్లో స్థానిక బాక్సర్ కె.లోహిత్‌తో చిత్తూరుకు చెందిన ఎం.మున్నా తలపడనున్నాడు. విశాఖలోని రైల్వే బాక్సింగ్ హాల్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా శనివారం పలు వెయిట్ కేటగిరిల్లో మెన్ సెమీస్ పోటీలు జరిగాయి. ఆదివారం జరిగే ఫైనల్‌లో ఫెదర్‌వెయిట్ 54–57కేజీల్లో స్థానిక బాక్సర్ బాలగణేష్‌తో శ్రీకాకుళానికి చెందిన వి.మధు తలపడనున్నాడు. లైట్‌వెయిట్ 57–60కేజీల్లో పి.దిగ్విజయ్‌తో నెల్లూరుకు చెందిన జె.వాసు తలపడనుండగా లైట్ వెల్టర్ 60–63.5 కేజీల వెయిట్‌లో ఆశిఫ్‌తో జె.భానుప్రకాష్, వెల్టర్3.5–67కేజీల వెయిట్‌లో ఎస్.దిలీప్‌కుమార్‌తో ఎన్.హర్షవర్ధన్ పోటీపడనున్నాడు. లైట్‌మిడిల్ 67–71కేజీల వెయిట్‌లో బి.తృణతో వై.ప్రభువర్దన్, మిడిల్ 71–75కేజీల వెయిట్‌లో ఎస్.మోహన్‌రావుతో ఎ.అశోక్‌కుమార్ తలపడనున్నాడు. లైట్ హెవీ వెయిట్‌లో కె.దుర్గాప్రసాద్‌తో ఆయుష్ పూర్తి, క్రూజియర్ వెయిట్‌లో కె.రామ్‌తో పి.దేవ్‌కుమార్ తలపడనున్నారు. ఆదివారం మెన్ ఫైనల్స్‌తో పాటు టోర్నీలో భాగంగా వుమెన్ బౌట్స్ నిర్వహించనున్నారు.

మంచిని పంచే బాధ్యత విద్యార్థులదే..

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



తల్లి పాదాలకు నమస్కరిస్తున్న విద్యార్థిని

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గురించి మంచిని పంచే బాధ్యతను విద్యార్థులు, తల్లిదండ్రులు స్వీకరించాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి కోరారు. ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవం -ఎచీవర్స్ డే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ఏయూకు విద్యార్థులే ప్రధానమన్నారు. విశ్వవిద్యాలయం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకే చెందుతుందన్నారు. విద్యాభ్యాసం పూర్తి చేసిన వారంతా పూర్వ విద్యార్థుల సంఘంలో సభ్యులుగా చేరాలని సూచించారు. ఫార్మసీ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా స్టార్టప్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉన్నతంగా ఎదిగిన ప్రతీ విద్యార్థి తమ అనుభవాలు, జ్ఞానాన్ని వర్సిటీకి తిరిగివ్వాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, రెక్టార్ ఆచార్య కె.సమత, విభాగ ఆచార్యులు ఆచార్య గిరిజా శంకర్, ఆచార్య మురళీకృష్ణ, ఆచార్య శైలజ, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. విభిన్న ప్రాంతాల్లో ఉన్నతంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు పలువురు తమ ఉన్నతికి కళాశాల ఉపకరించిన విధానాన్ని వర్చువల్ విధానంలో పంచుకున్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన 82 మంది విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో నియామక పత్రాలను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను వేదికపైకి ఆహ్వానించి, వారిని సత్కరించి, విద్యార్థి తమ తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి, ఆశీస్సులు తీసుకున్న తరువాత వీసీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను స్వీకరించారు.

హార్బర్ ఆధునికీకరణకు సహకరించండి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌ను రూ. 152 కోట్లతో ఆధునీకరించేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళిక అమలుకు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను నాయకులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో హార్బర్ హైలెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పోర్టు అధికారులు, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, మత్స్యకార సంఘాల నాయకులు వాసుపల్లి జానకీరామ్, బర్రె కొండబాబు, చింతపల్లి వీరన్న, దూడ పోలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునికీకరణకు టెండర్లు పిలిచామన్నారు. కొన్ని పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు.

సీఎస్ దృష్టికి ప్రజా రవాణా ఉద్యోగుల సమస్యలు



జవహర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

మద్దిలపాలెం: ఏపీఎస్ఆర్టీసీగా ఉన్న కాలంలో విధుల్లో చేరిన ఉద్యోగుల సర్వీసును ప్రజారవాణా శాఖలో పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని కోరామని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు తాడేపల్లిలో శనివారం సీఎస్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. విలీనం సమయంలో పొందుపరిచిన అంశాల్లో కొన్ని పెండింగ్ ఉన్నాయని, వాటి పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి సీఎస్ జవహర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యలో రాణిస్తే ఉన్నత శిఖరాలు

- లయిన్స్ క్లబ్ నార్త్ ఈస్ట్ ప్రతినిధి సోమరాజు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న లయిన్స్ క్లబ్ ప్రతినిధి సోమరాజు

మద్దిలపాలెం: విద్యలో రాణిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని లయిన్స్ క్లబ్ నార్త్ ఈస్ట్ ప్రతినిధి సోమరాజు అన్నారు. దాని కోసం విద్యార్థి దశలోనే నిర్దిష్ట లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. మద్దిలపాలెంలోని డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సప్లిమెంటరీ విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక తరగతులు శనివారంతో ముగిశాయి. లయిన్స్ క్లబ్ నార్త్ ఈస్ట్ సౌజన్యంలో 75 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. సోమరాజు మాట్లాడుతూ విద్యతో ఉజ్వల భవిష్యత్తు సాకారమవుతుందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి లయిన్స్ క్లబ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు సన్యాసినాయుడు, వేదవ్యాస్, రిషి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న మహిళలకు సూచనలు ఇస్తున్న ఇనస్ట్రక్టర్

మద్దిలపాలెం: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం ద్వారా పిఠాపురంకాలనీ లోని జన శిక్షణ సంస్థాన్‌లో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామని జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సి.హెచ్. అప్పలనాయుడు తెలిపారు. నైపుణ్యం, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ద్వారా మహిళల స్వయం ఉపాధి పొందే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే ముస్లిం తాటిచెట్లపాలెం, మల్కాపురం, అనకాపల్లి కేంద్రాలుగా శిక్షణ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో 120 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారన్నారు. 15 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు శిక్షణ పొందడానికి అర్హులని తెలిపారు. నైపుణ్యం గల యువతరాన్ని తయారు చేయాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు.

రాణించిన యశ్వంత్, చంటి

విశాఖ స్పోర్ట్స్ : వీడీసీఏ డివిజన్ లీగ్‌లో భాగంగా మూడో డివిజన్‌లో జరిగిన పోటీల్లో యశ్వంత్, చంటి రాణించి జట్టుకు విజయాన్నందించారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో సోలో సీసీతో తలపడిన సిటీసీసీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 264 పరుగులకు ఆలౌటైంది. యశ్వంత్ (107)సెంచరీ నమోదు చేయగా వరుణ్ 77 పరుగులు చేశాడు. ప్రతిగా సోలోసీసీ 185 పరుగులకే ఆలౌటైంది. చంటి 44 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు.

యూకో బ్యాంకు కొత్త శాఖ ప్రారంభం

ఎంవీపీ కాలనీ: సెక్టార్-8 ఉషోదయ కూడలి రోడ్డులో యూకో బ్యాంకు నూతన కార్యాలయాన్ని శనివారం ముఖ్య అతిథి సంస్థ ఎండీ శంకర్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంవీపీలో ప్రారంభించిన ఈ కార్యాలయం ఏపీలో 45వ బ్యాంకు శాఖని తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి యూకో బ్యాంకు 86 శాఖల్లో విజయవంతంగా ఖాతాదారులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అతి తక్కువ వడ్డీ రేటుకే గృహ రుణాలతోపాటు మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు.